సాక్షి ఆదిలాబాద్

I

గురువారం | 2 | అక్టోబర్ | 2025



న్యూస్‌రీల్

కేలాపూర్ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కేలాపూర్ జగదాంబ దేవి మాతను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం దర్శించుకున్నారు. మహార్నవమి పురస్కరించుకొని బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు



పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆల యంలో ఆదివాసీలు దసరా పూజలు నిర్వహించారు. నవ ధాన్యాలతో తయారు చేసిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు తరలివచ్చారు. ఇందులో కోసేరావ్, హనుమంత్‌రావ్, బాదిరావ్, శేఖు, లింబారావ్, సూర్యారావ్ తదితరులున్నారు.

'నవ ప్రజారాజ్యం' తొలగింపు

కైలాస్‌నగర్: ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించనందుకు గాను నవ ప్రజారాజ్యం పార్టీని రిజిస్టర్ రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. మూడు ఆర్థిక సంవత్సరాలకు (2021-22, 2022-23 2023-24) సంబంధించిన వార్షిక ఆడిట్ చేయించిన ఖాతాల వివరాలను నిర్దేశిత గడువులోపు సమర్పించలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి 75 రోజుల్లోపు, లోక్‌సభ ఎన్నికల నుంచి 90 రోజుల్లోపు ఖర్చు నివేదికలు అందించలేదని తెలిపారు. ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం కమిషన్ అధికారాలను వినియోగించి ఈ పార్టీని రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరం ఉంటే పార్టీ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారికి అఫిడవిట్ సమర్పించాలని సూచించారు. ఈనెల 8న విచారణ ఉంటుందని పార్టీ అధ్యక్ష, కార్యదర్శి హాజరు కావాలని పేర్కొన్నారు. ఎలాంటి సమాధానం రాకపోతే, పార్టీ ఏమి చెప్పలేదని భావించి, ఎన్నికల కమిషన్ రద్దు ఉత్తర్వులు జారీ చేస్తుందని వెల్లడించారు.

నార్నూర్ ఆస్పత్రిలో టెలీ మెడిసిన్ సేవలు

నార్నూర్: టెలీ మెడిసిన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. స్వశోధన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టెలీ మెడిషన్ కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఆధునిక వైద్యసేవలను టెలీ మెడిసిన్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. డిజిటల్ ఈసీజీ, డిజిటల్ ఎక్స్‌రేతో పాటు బీపీ, షుగర్, మహిళలకు సంబంధించిన వైద్య సేవలను ప్రత్యేక వైద్య నిపుణులతో టెలీమెడిసన్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి రాంబాబు, వైద్యుడు జితేందర్ రెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురం



బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సామూహిక బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన మహిళలు, యువతులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకువచ్చి ఆడి పాడారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రవి కిరణ్ యాదవ్, సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్

సర్వం సిద్ధం

- దసరా వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్: దసరా మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. విజయదశమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని దసరా మైదానంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇది దశాబ్దాలుగా ఆనవాయితీగా కొనసాగుతోంది. ముందుగా పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్రగా సాగి దసరా మైదానంలో జమ్మి పూజ నిర్వహిస్తారు. ధ్వజారోహణం చేపట్టి అతిథులు రావణ దహన కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హనుమాండ్లు వెల్లడించారు. మరోవైపు సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి సైతం ఏర్పాట్లు పూర్తయినట్లు సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తెలిపారు.



వేడుకలకు ముస్తాబైన వేదిక



కాషాయ పతాకాలతో దసరా మైదానం

పండుగకు సొంతూరుకే..



తాంసి: మా సొంతూరు తాంసి. ఉద్యోగరీత్యా కుటుంబంతో సహా కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాం. రాష్ట్ర సచివాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. ఎన్ని పనులున్నా పండుగలకు మాత్రం అందరం కలిసి ఇక్కడికే వస్తుంటాం. పుట్టి పెరిగిన గ్రామంలో పండుగలు జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది. అలాగే అందరిని కలుసుకునే అవకాశం ఉంటుంది. –రామగిరి స్వామి

ప్చ్.. దశ మారలే!

- రైతు మోములో కనిపించని దశమి కళ
- దిగుబడిపై తప్పని ఆందోళన
- పండుగ వేళ అప్పుల పరేషాన్
- భారీ వర్షాలతో సాగు అస్తవ్యస్తం



ఈ రైతు పేరు సొదారి మల్లన్న. తాంసి మండల కేంద్రం. వానాకాలంలో రూ.3లక్షలు చెల్లించి 15 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. మూడేళ్లుగా ఇలాగే సాగు చేస్తున్నాడు. గతేదాది ఇదే సమయానికి 20 క్వింటాళ్ల పత్తి చేతికొచ్చింది. ఈసారి భారీ వర్షాల కారణంగా అడుగుభాగాన కాయలు మురిగిపోయాయి. పైన ఉన్నవి ఇంకా విచ్చుకోని పరిస్థితి. మళ్లీ వచ్చిన పూత, కాత కూడా రాలిపోయింది. ఇప్పటికే రూ.4లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. గతేదాది మొత్తం 135 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈ ఏడాది అందులో సగమైనా వస్తుందా.. లేదా అని మదన చెందుతున్నాడు. ఈ సారి దసరా పండుగ ఉత్సాహం ఇతనిలో కనిపించడం లేదు.



ఈ రైతు పేరు ఎక్కల్ల రవి. ఈయనది సొనాల. 20 ఎకరాలు కౌలుకు తీసుకొని సోయా సాగు చేశాడు. అధిక వర్షాలతో పంట ఆలస్యంగా చేతికొస్తుంది. కొన్ని చోట్ల కాయలకు మొలకలు వచ్చాయి. చేతికొచ్చిన దిగుబడిని విక్రయించి పండుగ ఉత్సాహంగా జరుపుకుందామని భావించినప్పటికీ ఇప్పుడా పరిస్థితి లేదు. కుమారుడి చదువు కోసం డబ్బులు వెచ్చించాలని అనుకున్నాడు. ప్రస్తుతం పంట దిగుబడిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.



తాంసి శివారులో పత్తి పంట పరిస్థితి ఇది..

వానాకాలంలో పంటల సాగు వివరాలు.. (ఎకరాల్లో)
మొత్తం సాగు విస్తీర్ణం: 5.85లక్షలు
పత్తి : 4.40లక్షలు
సోయా : 62,500
కంది : 55వేలు
ఇతర పంటలు : 27,500

సాక్షి,ఆదిలాబాద్: దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా.. దశమి వచ్చిందయ్యా.. దశనే మార్చిందయ్యా.. ఇది ఓ సినిమాలోని పాట. అయితే ఇప్పుడు జిల్లాలోని రైతులకు ఆ సరదా లేదు.. దశ అంతకంటే లేదు.. ఎందుకంటే ఈ దసరా వచ్చిందంటే ఇటు పత్తి, అటు సోయా దిగుబడులు చేతికొచ్చేవి. పండుగ వేడుకలు నిర్వహించేందుకు ఆ దిగుబడుల్లో కొంతమేర విక్రయించుకొని సంబరాలు జరుపుకునేవారు. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితే లేదు. దీనంతటికి వానాకాలంలో కురిసిన భారీ వర్షాలే కారణం. ఏకంగా 35 శాతం అధిక వర్షపాతం నమోదుతో పంటల పరిస్థితి పూర్తిగా ఆగమాగం అయిపోయింది. పత్తి కాయలు విచ్చుకొని తెల్లటి పత్తి బయటకు కనిపించాల్సిన సమయంలో దిగువ భాగంలో ఆ కాయలు పూర్తిగా మురిగిపోయి ఉండటం, పైభాగంలో ఉన్న కాయలు అసలుకే విచ్చుకోలేదు. తేమశాతం అధికంగా ఉండడమే కారణంగా తెలుస్తోంది. పత్తి పంట కాలం మరో నెల పెరిగింది. దీంతోపాటు రైతు అంతర్‌కృషి, మందుల కోసం మళ్లీ పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి. దిగుబడులు చేతికొచ్చి ఆనందపడాల్సిన సమయంలో ఇంకా పంట కోసం తిప్పలు పడాల్సిన దుస్థితిలో అన్నదాతలు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే దశమి ఉత్సాహం రైతు ఇంట్లో కనిపించడం లేదు. చేతిలో కాసులు లేక కర్షకులు దిగాలు చెందుతున్నారు.

వెంటాడుతున్న అప్పులు..

సాధారణంగా జిల్లాలో వానకాలం సీజన్‌లోనే భారీగా పంటలు సాగవుతాయి. పత్తి, సోయా, కందులను పెద్ద మొత్తంలో సాగు చేస్తారు. దీనికోసం రైతులు బ్యాంకులతో పాటు దళారుల వద్ద ప్రైవేట్ అప్పులు తీసుకుంటారు. పంట దిగుబడులు ఏటా దసరా వరకు చేతికొస్తాయి. దీంతో వాటిని విక్రయించి అప్పులు తీర్చి రైతు తన ఖర్చుల కోసం మిగతా మొత్తాన్ని వెచ్చించడం జరుగుతుంది. ఇంట్లో శుభకార్యాలు, పిల్లల చదువులు, ఇతరత్రా వాటి కోసం డబ్బులను లెక్కలతో సరిపోల్చుకుంటాడు. అయితే ఇప్పుడు ఇవేమి రైతుకు కనిపించడం లేదు. అప్పులు మాత్రం మీద పడ్డాయి. ప్రైవేట్ అప్పుల పరంగా దళారుల నుంచి రైతులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

ఆదర్శం.. పల్సి(బి) తండా

- 28 ఏళ్లుగా మద్యం, మాంసానికి దూరం
- గొడవలు లేకుండా.. ఠాణా మెట్లెక్కకుండా
- గ్రామస్తులంతా ఒకే మాటతో ముందుకు
- ఏళ్లుగా ఆధ్యాత్మిక బాటలోనే..
- మహాత్ముడి స్ఫూర్తితో అభివృద్ధి దిశగా గ్రామం



మహాత్ముడి ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటున్న గ్రామమది. మాటకు కట్టుబడి దశాబ్దాలుగా మద్యపానం, జీవహింసకు దూరంగా ఉంటున్న పల్లె. దాదాపు మూడు దశాబ్దాలుగా మద్యం, మాంసం ముట్టకుండా నిత్యం ఆధ్యాత్మిక భావనతో ఆదర్శంగా నిలుస్తోంది తలమడుగు మండలంలోని పల్సి(బి)తండా. ఎలాంటి గొడవలు లేకుండా ఠాణా మెట్లు ఎక్కకుండా ఐక్యతతో ముందుకు సాగుతున్నారు ఈ గ్రామస్తులు. ఐక్యత రాగంతో అభివృద్ధిలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు గాంధీ జయంతి సందర్భంగా గ్రామంపై ప్రత్యేక కథనం. – తలమడుగు



పల్సి(బి) తండా గ్రామ ముఖచిత్రం

ఈ గ్రామంలో 1997లో పలువురు మద్యానికి బానిసయ్యారు. నిత్యం గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో ఇద్దరు, ముగ్గురు చనిపోవడంతో వారి కుటుంబాలు ఛిద్రమయ్యాయి. అప్పుడే గ్రామస్తులంతా ఒక నిర్ణయానికి వచ్చారు. గ్రామంలో ఎవరూ మద్యం ముట్టవద్దని, విక్రయించవద్దని తీర్మానం చేశారు. అదే సమయంలో గ్రామానికి నారాయణ బాబా వచ్చారు. ఆయన బోధనలకు ప్రభావితమై మాంసానికి సైతం దూరమయ్యారు. ఆధ్యాత్మికానికి చేరువయ్యారు. దశాబ్దాలుగా అదే బాటలో కొనసాగుతున్నారు. గ్రామ జనాభా దాదాపు 900 వరకు ఉంటుంది. బాబా మరణాంతరం గ్రామంలో ఆయన పేరిట సద్గురు నారాయణ ఆలయం నిర్మించుకున్నారు. ఇందులో ప్రతీ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించడం, అన్నదానం చేయడం, ఏటా దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామాభివృద్ధిలోనూ సమష్టిగా భాగస్వాములవుతున్నారు. స్థానిక వృద్ధులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడ వృద్ధాశ్రమం సైతం నిర్మించారు. నారాయణ బాబా సంస్థాన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

నూతన పంచాయతీగా..

పల్సి(బి)గ్రామ పంచాయతీ పరిధిలో పల్సి(బి)తండా ఉండేది. 2019లో నూతన జీపీగా ఆవిర్భవించింది. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో సర్పంచ్, వార్డుమెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూడా ఆయా పదవులను ఏకగ్రీవం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు గ్రామస్తులు. గత పాలక వర్గంలో ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇంటింటికి తాగునీటితో పాటు, సెగ్రిగేషన్ షెడ్లు వంటివి నిర్మించుకున్నారు. అలాగే గొడవలకు దూరంగా ఉంటూ పోలీస్ స్టేషన్ మెట్లు సైతం ఎక్కడం లేదు. ఆధ్యాత్మిక బాటలో ఐక్యంగా ఉంటూ గ్రామాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు.



గ్రామంలోని నారాయణ బాబా ఆలయం

నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనంతో పాటు దసరా పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. నిమజ్జనోత్సవం కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పోలీసు సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. 30 మంది మహిళా సిబ్బందితో బందోబస్తు, షీటీంతో పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆకతాయిల వేధింపులకు గురయితే మహిళలు డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. నిమజ్జనం దృష్ట్యా ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల పోలీసు స్టేషన్ల పరిధిలో 200 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 9 సెక్టార్లు, 4 క్లస్టర్లుగా విభజించి సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, పట్టణ సీఐలు సునిల్ కుమార్, నాగరాజు, ఫణిందర్, ప్రేమ్‌కుమార్, స్వామి, అంజమ్మ, పద్మ, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో దివ్యాంగులు, గర్భిణులు, ఫీడింగ్ ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ అన్నారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షిషాను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల రోజు వివాహ శుభకార్యాలు ఉన్నటువంటి, ఉద్యోగ విరమణ దగ్గర ఉన్న ఉపాధ్యాయులకు విధులు కేటాయించవద్దని కోరారు. 2024లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే రెమ్యూనరేషన్ ఇవ్వలేదని, ఆ డబ్బులను ఇప్పించాలని విన్నవించారు. ఇందులో యూనియన్ నాయకులు రవీందర్‌రెడ్డి, దేవ్‌రావు, నతీస్ కుమార్, ప్రభాకర్, శ్రీనివాస్, నాందేవ్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెళ్లి రావమ్మా.. దుర్గమ్మా



నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు భక్తుల విశేష పూజలు అందుకున్న అమ్మవారు బుధవారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. డప్పుచప్పుళ్లు, భక్తుల నృత్యాల నడుమ శోభాయాత్రగా అమ్మవారిని ప్రత్యేక రథాలు, పల్లకీల్లో తరలించారు. వెళ్లి రావమ్మా దుర్గమ్మా.. అంటూ గంగమ్మ ఒడికి సాగనంపారు. – ఆదిలాబాద్



నృత్యం చేస్తున్న యువతులు, మహిళలు

మహారాష్ట్ర రైతులకు అవకాశం కల్పించాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న బజరంగ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మార్కెట్‌లో మహారాష్ట్ర రైతులకు పత్తి అమ్ముకునే అవకాశం కల్పించాలని బీజేపీ కిసాన్‌మోర్చా కిన్వట్ అధ్యక్షుడు బజరంగ్‌రెడ్డి, ఆదిలా బాద్ ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎల్టీ శేఖర్‌రెడ్డి కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో ఎంపీ నగేశ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మహారాష్ట్రలోని కిన్వట్, మాహోర్ తాలుకాలో పత్తి ప్రాసెసింగ్ పరిశ్రమలు లేకపోవడంతో రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లి పత్తిని విక్రయించాల్సి వస్తుందని తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు ఎక్కువై రైతులపై ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర రైతులు సైతం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి అమ్ముకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎంపీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో దుర్గామాతను ఎంపీ నగేశ్ బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక నాయకులు కృష్ణకుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

క్లుప్తంగా

బెల్ట్‌షాపుపై దాడి.. మద్యం స్వాధీనం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రవీంద్రనగర్ కాలనీలో నరాల రాజేశ్వర్ నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై బుధవారం సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా దాచి ఉంచిన రూ.38 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ జాదవ్ రమేశ్ ఎదుట బైండోవర్ చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ఎస్సై పురుషోత్తం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



విద్యుత్ తీగలు తొలగిస్తున్న సిబ్బంది

చెన్నూర్‌రూరల్: విద్యుత్ తీగలు అమర్చి అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ డివిజన్ అధికారి కె.సర్వేశ్వర్ హెచ్చరించారు. మండలంలోని ఒత్కులపల్లి, కొత్తపల్లి గ్రామాల సమీపాల్లోని అటవీ ప్రాంతంలో కొంద రు గుర్తు తెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చారని బుధవారం రాత్రి అందిన పక్కా సమాచారం మేరకు అటవీ సిబ్బందితో కలిసి వెళ్లి విద్యుత్ తీగలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలు ఎవరు అమర్చారో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వేమనపల్లి: వన్యప్రాణుల వేట కోసం అటవీ సరిహద్దుల వెంట విద్యుత్ ఉచ్చులు అమర్చటం ప్రమాదకరమని నీల్వాయి అటవీ రేంజ్ అధికారి హఫీజొద్దీన్ అన్నారు. బుధవారం కల్మలపేట, చామనపల్లి, బద్దంపల్లి ఇతర గ్రామాల్లో వన్యప్రాణుల వేట వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డీఆర్వో ప్రమోద్‌కుమార్ ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కవ్వాల్ అందాలు చూసొద్దాం!

- జన్నారం అటవీ డివిజన్‌లో ప్రారంభమైన సఫారీ
- వర్షాలు తగ్గడంతో అటవీశాఖ అనుమతి
- రోజుకు మూడుసార్లు.. రెండు గంటలు ప్రయాణం
- స్వల్పంగా పెరిగిన ధరలు

జన్నారం: పచ్చని చెట్లు, దట్టమైన అడవులు, చెంగు చెంగున ఎగురుతూ పరిగెత్తే వన్యప్రాణులు, స్వచ్ఛమైన ప్రాణవాయువు.. వీటికి చిరునామా కవ్వాల్ అడవులు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో సఫారీ ప్రయాణంతో పర్యాటకులు నేరుగా అటవీ అందాలను, వన్యప్రాణులను చూసి ఆహ్లాదం పొందుతున్నారు. అటవీశాఖ ప్రతీ సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు సఫారీ ప్రయాణానికి అనుమతి నిలిపివేస్తుంది. తిరిగి అక్టోబర్ 1 నుంచి సఫారీ ప్రారంభమవుతుంది. ఈ ఏడాది గత వారం రోజుల వరకు వర్షాలు ఎక్కువగా కురువడంతో సఫారీకి మరికొంత సమయం పడుతుందని అంతా భావించారు. కానీ మూడు రోజులుగా వర్షాలు పడకపోవడంతో బుధవారం నుంచి సఫారీ ప్రయాణానికి అటవీశాఖ అధికారులు అనుమతినిచ్చారు.

అడవిలో రెండు గంటలు..

జన్నారం అటవీ రేంజ్‌లోని పలు ప్రాంతాలలో సఫారీ ప్రయాణానికి అనుమతి ఉంది. ఈ సఫారీ ప్రయాణం రెండు గంటలు ఉంటుంది. ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు, ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు మూడుసార్లు సఫారీ ప్రయాణం ఉంటుంది. ఈ రెండు గంటలు గేట్ నంబర్ 1 నుంచి



సఫారీలో అడవికి బయలుదేరుతున్న పర్యాటకులు

గొండుగూడ బేస్ క్యాంపు, బైసన్‌కుంట, మైసమ్మ కుంట ప్రాంతాల వరకు తీసుకెళ్తారు. బైసన్‌కుంటలో సేద తీరడానికి, టిఫిన్ చేయడానికి సౌకర్యం కల్పించారు. ఈ ప్రాంతంలో వన్యప్రాణులు ఎక్కువగా కనిపిస్తాయి.

పెరిగిన సఫారీ ధరలు

పర్యాటకులను అడవుల్లోకి తీసుకెళ్లడానికి అటవీశాఖ అధికారులు ఐదు సఫారీలను, పర్యాటక శాఖ అధికారులు రెండు సఫారీలను ఏర్పాటు చేశారు. ఈసారి సఫారీ ధరలు గతం కంటే పెరిగాయి. సోమవారం నుంచి గురువారం వరకు ఆరుగురికి రూ. 3500, అదనపు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీకెండ్ రోజుల్లో (శుక్ర, శని, ఆదివారాల్లో) సఫారీ ఆరుగురికి రూ.4000, అదనపు సభ్యుడికి రూ. 500 చొప్పున చెల్లించాలి. కాగా ముందుగానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

తగ్గిన హరిత గదుల ధరలు

దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బస చేయడానికి జన్నారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హరిత రిసార్ట్ గదుల ధరలు తగ్గాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ధరలు తగ్గాయి. గతంలో సోమవారం నుంచి గురువారం వరకు ఏసీ గదులు రూ.2016, నాన్ ఏసీ గదులు రూ.1232, డార్మెంటరీ గది రూ.2500లుగా ఉండేవి. వీకెండ్ (శుక్ర, శని, ఆదివారాల్లో) ఏసీ గది రూ.2240, నాన్ ఏసీ రూ.1344, డార్మెంటరీ రూ. 3000 ఉండేవి. జీఎస్టీ తగ్గడంతో ఈ సంవత్సరం ప్రస్తుతం సోమవారం నుంచి గురువారం వరకు నాన్ ఏసీ రూ.1155, ఏసీ రూ.1890, డార్మెంటరీ రూ.2500, వీకెండ్‌లో నాన్ ఏసీ రూ.1260, ఏసీ గదులు రూ. 2100, డార్మెంటరీ రూ.3000గా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ముందుగా టీఎస్‌టీడీసీ అనే వెబ్‌సైట్ ద్వారా గదులను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

పర్యాటకుల తాకిడి



అటవీశాఖ సఫారీ ప్రయాణానికి అనుమతి ఇవ్వడంతో పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే హరిత రిసార్ట్‌కు పర్యాటకులు పెరుగుతున్నా సఫారీ లేకపోవడంతో కొంత నిరుత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం సఫారీ మొదలైంది. దీంతో పర్యాటకులు మరింతగా పెరుగుతారు.

– వీరేందర్, హరిత మేనేజర్

ఉన్నతాధికారుల ఆదేశాలతో..



జన్నారం డివిజన్‌లో గత మూడు నెలలుగా వన్యప్రాణుల సంరక్షణ దృష్టిలో పెట్టుకుని సఫారీకి అనుమతి ఇవ్వలేదు. వర్షాలు తగ్గుముఖం పట్టి, సఫారీ తిరిగే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ప్రారంభించాం. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో, జన్నారం

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బాసర: బాసరలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు పదో రోజు మహా సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులుతీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆలయ వైదిక బృందం నవ చండీ హోమం, పూర్ణహుతి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సరస్వతి, మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లకు వేద మంత్రోచ్ఛరణలతో మధ్య వైదిక బృందం మహాభిషేకము, విశేష అలంకరణ పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు చతుషష్టి పూజలు నిర్వహించారు.



బాసర ఆలయంలో నవ చండీహోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చక బృందం

నేటి పూజలు..

విజయదశమి గురువారం వేకువ జామున 4 గంటలకు అమ్మవార్లకు మహాభిషేకము, ప్రాతఃకాల చతుషష్టి, శమీపూజ, పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్ తెలిపారు.

జెడ్పీటీసీ గరిష్ట ఖర్చు రూ.4 లక్షలు

కైలాస్‌నగర్: స్థానిక రిజర్వేషన్లు ఖరారు కావడంతో పల్లె రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు సై అంటున్నారు. ఆ దిశగా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గెలుపే లక్ష్యంగా లక్షలను గుమ్మరించేందుకు రెడీ అవుతున్నారు. అయితే సదరు అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితిని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం- 2018లోని సెక్షన్ 237 ప్రకారం ఏ ఎన్నికలో ఎంత ఖర్చు చేయాలనే వివరాలు వెల్లడించింది. జిల్లా ప్రజాపరిషత్ సభ్యుడు (జెడ్పీటీసీ)గా పోటీచేసే వారు గరిష్ఠంగా రూ.4లక్షలు, మండల ప్రజా పరిషత్ (ఎంపీటీసీ) అభ్యర్థులు రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి చేసే గరిష్ట ఎన్నికల ఖర్చుల వివరాలను సైతం నిర్దేశించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 5వేలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగి ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు రూ. 2.50 లక్షలు, 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక వార్డు మెంబర్లు 5వేలు లేదా అంత కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో రూ.50వేలు, అంత కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ.30వేలను ఈసీ నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఎప్పటికప్పుడు అందించాల్సి ఉంటుంది.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని బైల్‌బజార్ ప్రాంతానికి చెందిన తిరుపులే రాంచందర్(33) అనే వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై నాగభూషణం కథనం ప్రకారం.. రాంచందర్ స్థానికంగా పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసగా మారి తరచూ భార్యను వేధిస్తుండడంతో ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రాంచందర్ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం అతని తల్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగాసాగర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రాంచందర్ పెయింటింగ్ పని లేకపోవడంతో ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు భైంసా పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల కారణంగా స్థానికులకు ఉపాధి లేకుండా పోయిందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.

దుబాయ్‌లో భైంసా వాసి మృతి



తుమ్మల శ్రీనివాస్ (ఫైల్)

భైంసాటౌన్: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన భైంసా వాసి అక్కడ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సంతోష్‌మాత నగర్‌కు చెందిన తుమ్మల శ్రీనివాస్(35) నెల క్రితం దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన కొద్దిరోజులకే మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరిగాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించాలని ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీని కుటుంబ సభ్యులు సంప్రదించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పొన్నారిలో శతాధిక వృద్ధురాలు మృతి



ముచ్చ ఎల్లక్క (ఫైల్)

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ముచ్చ ఎల్లక్క(102) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. గత కొంత కాలంగా వయోభారంతో బాధపడుతున్న ఎల్లక్క ఇంటి వద్ద మృతిచెందింది. గ్రామంలోనే అత్యధిక వయస్కురాలిగా ఉన్న ఎల్లక్క ఆహార అలవాట్లతో ఆరోగ్యంగా ఉండేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన బోరు యజమానిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాఘాపూర్ గ్రామంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నీటి బోర్లు వేసిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వైష్ణవి బోర్‌వెల్స్ యజమానిపై కేసు నమోదు చేసిన్నట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. గత రెండు రోజులుగా వాఘాపూర్, కొలాంగూడ గ్రామంలో నీటి బోర్లు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బోర్లు వేయవద్దని అధికారులు సూచించినా పట్టించుకోలేదని తహసీల్దార్ వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు. అలాగే బోరు వేసే వాహనాన్ని సైతం సీజ్ చేశామని తెలిపారు.

ఎనిమిది మంది బైండోవర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని లారీ అసోసియేషన్‌లో మంగళవారం గొడవ చోటు చేసుకున్న నేపథ్యంలో అసోసియేషన్‌లోని ఎనిమిది మందిని బుధవారం బైండోవర్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యగా సిద్ది తన్వీర్, షేక్ వసీం, షేక్ షౌకత్, అరవింద్, ఆసిఫాన్, షేక్ కలీం, షేక్ ముజాహిద్, షేక్ మోయిన్‌లను బైండోవర్ చేసినట్లు వివరించారు.

హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

జన్నారం: హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దర్శనాల నరేశ్ మంగళవారం రాత్రి బ తుకమ్మ వద్ద గల లైట్లను పగులకొట్టగా అదే గ్రామానికి చెందిన బోర్లకుంట శంకరయ్యకు, నరేశ్‌కు మధ్య గొడవ జరిగింది. నరేశ్ శంకరయ్యను కత్తితో పొడవగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు శంకరయ్యను 108 లో ఆసుపత్రికి తరలించారు. శంకరయ్య ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కడెం ప్రధాన కాలువలో ఒకరి గల్లంతు



సురేందర్

దస్తురాబాద్: కడెం ఎడమ కాలువలో ప్రమాదవశాత్తు ఒకరు గల్లంతైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన మైదం సురేందర్ అనే వ్యక్తి ఉదయం 10 గంటలకు కడెం ఎడమ కాలువలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా వరద ఉధృతికి మునిగిపోవడంతో అతని ఆచూకీ లభించలేదు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ విశ్వంబర్ పరిశీలించారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తవ్వకాల్లో దొరికిన వినాయక విగ్రహానికి పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన శారద దేవి మండపం వద్ద ప్లాంటేషన్ సందర్భంగా జరిపిన తవ్వకాల్లో వినాయక విగ్రహం బయల్పడింది. ఈ సందర్భంగా బుధవారం కాలనీవాసులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు క్షీరాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్



నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నాలుగో సీజన్ పోటీల్లో భాగంగా జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తలపడుతుంది. మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కాగా, అక్టోబర్ 26న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో లీగ్ సహ వ్యవస్థాపకుడు తుహిన్ మిశ్రా, సీఈఓ జాయ్ భట్టాచార్య తదితరులు పాల్గొని టోర్నీ వివరాలను ప్రకటించారు. గత మూడు సీజన్లతో పోలిస్తే ఈసారి లీగ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగిందని, టోర్నీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు పీవీఎల్ సీజన్ కోసం కొత్త జెర్సీని రూపొందించింది. తెలంగాణలోని ప్రఖ్యాత పోచంపల్లి ఇక్కత్ డిజైనింగ్ స్ఫూర్తిగా దీనిని తయారు చేసినట్లు టీమ్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు.



ఆస్ట్రేలియా బోణీ

- యాష్లే గార్డ్‌నర్ సెంచరీ
- 89 పరుగులతో ఓడిన న్యూజిలాండ్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లే గార్డ్‌నర్ (83 బంతుల్లో 115; 16 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో లీ తహుహు, జెస్ కెర్ 3 వికెట్ల చొప్పున... బ్రీ ఇలింగ్, అమెలియా కెర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 43.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ సోఫీ డివైన్ (112 బంతుల్లో 111; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో సోఫీ, అనాబెల్ 3 వికెట్ల చొప్పున తీశారు. కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.

'ట్రోఫీ కావాలంటే వచ్చి తీసుకెళ్లండి'

ఆసియా కప్‌పై నఖ్వీ మంకుపట్టు

దుబాయ్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకుండా అట్టిపెట్టుకున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ మళ్లీ తన దురుద్దేశాన్ని బయటపెట్టాడు. టీమిండియాకు ట్రోఫీ కావాలంటే ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని, అయితే అప్పుడు కూడా తానే ఇస్తానని అతను తన మొండితనాన్ని ప్రదర్శించాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, కేంద్ర మంత్రి కూడా అయిన నఖ్వీ నుంచి తాము ట్రోఫీని అందుకోమని ఫైనల్ తర్వాత స్పష్టం చేసిన భారత జట్టు... కప్ లేకుండానే స్వదేశానికి వెళ్లిపోయింది. దాంతో నఖ్వీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

సొంతగడ్డపై టెస్టుల్లో భారత్ దాదాపు 12 ఏళ్ల పాటు ఎదురులేని జట్టుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యటనకు వచ్చిన పెద్ద జట్లు కూడా టీమిండియా జోరును ఆపలేకపోయాయి. అయితే పుష్కర కాలం తర్వాత బలహీనం అనుకున్న న్యూజిలాండ్ పెద్ద దెబ్బ కొట్టింది. గత ఏడాది అనూహ్యంగా కివీస్ చేతిలో భారత్ క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ మన టీమ్ స్వదేశంలో టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. ఈసారి కూడా బలహీనమైన వెస్టిండీస్ ఎదురుగా ఉంది. ఇంగ్లండ్‌పై చక్కటి ప్రదర్శన తర్వాత ఎలాంటి ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ఆడితే విండీస్‌పై పైచేయి ఖాయం. ఈ నేపథ్యంలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

- నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు
- జోరు మీదున్న గిల్ బృందం
- సంచలనంపై విండీస్ ఆశలు
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం


గిల్


రోస్టన్ ఛేజ్

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి నుంచి మొదటి టెస్టు జరుగుతుంది. సీనియర్లు కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా స్వదేశంలో ఆడనున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ఆటతో సిరీస్‌ను సమం చేసుకున్న టీమిండియా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆసీస్‌తో ఆడిన గత టెస్టులో '27 ఆలౌట్' తర్వాత విండీస్ ఇదే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. బలాబలాల్లో ఎంతో అంతరం కనిపిస్తుండగా, కరీబియన్ టీమ్ ఇక్కడ ఏమాత్రం పోటీనిస్తుందనేది సందేహమే.

అదనపు పేసర్‌తో...

సాధారణంగా స్వదేశంలో నల్లరేగడి మట్టితో సిద్ధం చేసే స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా పేస్‌కు అనుకూలించే 'ఎర్ర మట్టి' పిచ్‌పై తమ సత్తాను పరీక్షించుకోవాలని భావిస్తోంది. దీని ప్రకారమే తుది జట్టు ఉండవచ్చు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, సుందర్ ఖాయం. అయితే మూడో స్పిన్నర్ అయిన కుల్దీప్, మరో పేసర్ మధ్య పోటీ ఉండవచ్చు. పిచ్‌ను బట్టి చూస్తే ప్రసిధ్ వైపే మొగ్గు కనిపిస్తోంది. అయితే ఆరో స్థానంలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని ఆడిస్తే అప్పుడు కుల్దీప్‌కు అవకాశం ఉంటుంది. నితీశ్ జట్టులోకి వస్తే బ్యాటర్ పడిక్కల్‌ను కూడా పక్కన పెట్టాల్సి రావచ్చు. ఇంగ్లండ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోయినా నితీశ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. బ్యాటింగ్‌పరంగా యశస్వి, గిల్, రాహుల్ చక్కటి ఫామ్‌లో ఉండగా సుదర్శన్ కూడా ఇటీవల ఆస్ట్రేలియా 'ఎ'పై సత్తా చాటాడు.

అందరూ అంతంతే!

'మా గెలుపుపై ఎవరికీ అంచనాలు లేకపోవడమే మా బలం. ఓటమి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడతాం. కివీస్‌ను ఆదర్శంగా తీసుకుంటాం' అని వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ చెబుతున్నాడు. కానీ భారత్‌లో టెస్టులు అంటే ఎంతో కష్టమో విండీస్‌కు బాగా తెలుసు. 1994లో భారత్‌ను ఓడించిన తర్వాత ఇక్కడ ఆడిన 10 టెస్టుల్లో విండీస్ 8 ఓడి, 2 'డ్రా' చేసుకుంది. 2018లో ఆడిన సిరీస్‌లో 2 టెస్టులూ మూడు రోజులకే ముగిశాయి! పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి జట్టును నడిపించగల బ్యాటర్ ఎవరూ కనిపించడం లేదు. హోప్, ఛేజ్, వారికన్‌లకు మాత్రమే ఇక్కడ ఆడిన అనుభవం ఉండగా, జేడెన్ సీల్స్ ఇటీవల ఆకట్టుకుంటున్నాడు. ప్రధాన పేసర్లు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటు. విండీస్ కూడా ముగ్గురు పేసర్లతో ఆడనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, నితీశ్ రెడ్డి/పడిక్కల్, జడేజా, సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ప్రసిధ్. **వెస్టిండీస్:** ఛేజ్ (కెప్టెన్), చందర్‌పాల్, కెవ్లాన్ అండర్సన్, అతనజె, బ్రెండన్ కింగ్, షై హోప్, గ్రీవ్స్, పైర్, వారికన్, ఫిలిప్ అండర్సన్, సీల్స్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చికను ఎక్కువగా ఉంచారు. పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాగా బ్యాటర్లు పట్టుదల కనబర్చాల్సి ఉంది. నగరంలో అనూహ్యంగా కురుస్తున్న వర్షాలు మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగించవచ్చు.

అభిషేక్ అదుర్స్

టి20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఓపెనర్



దుబాయ్: ఇటీవల ముగిసిన ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో దంచికొట్టిన భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా అభిషేక్ రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లతో 'టాప్'లో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ ప్లేయర్ డేవిడ్ మలాన్ 919 రేటింగ్ పాయింట్లు సాధించి రికార్డు సృష్టించగా... ఐదేళ్ల తర్వాత దాన్ని అభిషేక్ సవరించాడు. టీమిండియా తరఫున గతంలో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లి 909 రేటింగ్ పాయింట్లు సాధించగా... ఇప్పుడు అభిషేక్ ఆ ఇద్దరినీ దాటేసి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ఫిల్ సాల్ట్ (844 పాయింట్లు) కంటే అభిషేక్ 82 రేటింగ్ పాయింట్లు ముందున్నాడు. పాకిస్తాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (819 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (698 పాయింట్లు) రెండు స్థానాలు కోల్పోయి 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా (233 పాయింట్లు) 'టాప్' ర్యాంక్ నుంచి రెండో స్థానానికి చేరగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (241 పాయింట్లు) నాలుగు ర్యాంక్‌లు మెరుగుపరుచుకొని అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆసియాకప్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన అయూబ్ బంతితో 8 వికెట్లు తీశాడు.

ముకేశ్‌కు పసిడి పతకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీని భారత్ 'టాప్' ర్యాంక్‌తో ముగించింది. చివరిరోజు బుధవారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన సాహిల్ 573 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో ముకేశ్‌కిది రెండో పతకం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ తేజస్విని 30 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

శశిరేఖ పరిచయం

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో నయనతార చేస్తున్న శశిరేఖ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.
ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: నవీన్ గారపాటి.


నయనతార

మాస్ జాతర ఫిక్స్


రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారు అయింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజ నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ నెల 31 విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ''వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో రూపొందిన చిత్రం 'మాస్ జాతర'. మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండగ సినిమాలా ఈ చిత్రాన్ని తీశారు భాను భోగవరపు. రవితేజను ఎలా చూడాలని అభిమానులు, ప్రేక్షకులు కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను తెరపై చూపించారాయన. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్.

ఓజీ విజయం నా ఒక్కడిది కాదు

\- పవన్ కల్యాణ్


సుజీత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య, తమన్

''ఓజీ' సినిమా విజయం నా ఒక్కడిది కాదు.. ఇందుకు కారణమైన మా టీమ్‌కి ధన్యవాదాలు'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన హీరోగా, ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్'లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''ఓ మూవీ ఫెయిల్యూర్‌కి నేనెప్పుడూ భయపడలేదు. ఇటీవల విడుదలైన 'హరి హర వీరమల్లు' సినిమాకి కూడా. నేను చాలా సార్లు ఫెయిల్ అయింది టీమ్ వర్క్ లేకే తప్ప నా ఎఫర్ట్స్ ఎప్పుడూ తగ్గవు. నాకు అన్నం పెట్టిన తల్లి సినిమా. ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా నేనున్నానంటే అది సినిమా ఇచ్చిందే. ఓడిపోతే నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు.. సినిమా అపజయమైతే ఆ నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు. సినిమా బాగున్నప్పుడు అందరూ ఉంటారు కానీ, బాగాలేనప్పుడు మన దగ్గర ఎవరు నిలబడతారో వాళ్లే మనవాళ్లు. నేనెప్పుడూ ఫెయిల్యూర్‌ని ఎదుగుదలకు ఒక మెట్టుగా చూస్తానే తప్ప అవరోధంగా చూడను. నేను సినిమా కంటే పెద్దది చేస్తున్నాను.. అదే రాజకీయం. చాలా కష్టమైన పని. సినిమాల్లో విలన్స్‌తో గొడవ పడటం ఈజీ. నిజ జీవితంలో అలా ఉండదు.. తల ఎగిరిపోవచ్చు కూడా. అది నాకు ఎక్స్‌ట్రా రిస్క్. కానీ, దేశంపై నాకు పిచ్చి ప్రేమ ఉంది. అందరి హీరోల సినిమాలు చూస్తాను. ప్రతి హీరో కష్టాన్ని నేను అభినందిస్తాను. అందరి హీరోల అభిమానులను నేను కోరుకునేది ఒక్కటే. ఫ్యాన్ వాయిస్‌ని ఆపేయండి.. అలాంటి స్లోగన్స్‌తో దయచేసి సినిమాని చంపేయకండి. ఇప్పుడు ఓ సినిమా జీవితం అనేది కేవలం ఆరు రోజులు అయిపోయింది. నిర్మాతలు సినిమాలు చేసేందుకు ముందుకు రాకపోతే ఎంతోమంది ఉపాధి కోల్పోతారు'' అన్నారు.


సోనాక్షీ సిన్హా

సుధీర్ బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ధన పిశాచిగా కనిపిస్తారు సోనాక్షీ సిన్హా. ఈ పాత్రకు సంబంధించిన 'ధన పిశాచి...' పాటను విడుదల చేశారు. సమీరా కొప్పికర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి ఆలపించారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

నిశ్చితార్థానికి వేళాయె


అల్లు శిరీష్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ నెల 31న నయనికతో తన నిశ్చితార్థం జరగనున్నట్టు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు శిరీష్. కాబోయే భార్యతో ఈఫిల్ టవర్ వద్ద దిగిన ఓ ఫొటోను (చేతులు మాత్రమే కనిపించేలా) పంచుకున్నారు. ''మా తాత అల్లు రామలింగయ్య జయంతి (అక్టోబరు 1) సందర్భంగా నా మనసుకు దగ్గరైన ఒక విషయాన్ని అందరితో పంచుకుంటున్నాను. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. ఇటీవల కన్నుమూసిన మా నానమ్మ కనకరత్నంగారు ఎప్పుడూ నేను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవారు. ఇప్పుడు ఆమె మా మధ్య లేకపోయినప్పటికీ మమ్మల్ని ఆమె ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను'' అంటూ పోస్ట్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అని టాక్. అయితే ఆమె గురించి పూర్తి వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది.

సరికొత్త విలయ తాండవం


ఆకాశ్ పూరి, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, పార్వతి అరుణ్, 'పుష్ప' మూవీ ఫేమ్ జగదీష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విలయ తాండవం'. వీఎస్ వాసు దర్శకత్వంలో జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో ఆకాశ్ పూరి, డైరెక్టర్ భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విలయ తాండవం' టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ పోస్టర్ చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. ''నేను తీసిన 'కౌసల్యా కృష్ణమూర్తి' చిత్రంలో కార్తీక్ నటించాడు. 'విలయ తాండవం'తో తనకి మరో హిట్ రావాలి'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ''సరికొత్త పాయింట్, కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ వాసు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''అద్భుతమైన కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు మందల ధర్మా రావు, గుంపు భాస్కర రావు, వీఎస్ వాసు.

వేట షురూ



గుణి, తరుణ్ భాస్కర్, వేణు

టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ''గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివితేటలు... ఒక రోజులో జరిగే ఘటనలు... ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతోంది'' అని యూనిట్ పేర్కొంది.

టీజర్ చాలా బాగుంది

\- అనిల్ రావిపూడి


గోపాల్, రామచంద్ర, అనిల్ రావిపూడి, రమణ్

''మటన్ సూప్' టైటిల్ బాగుంది. టీజర్ చాలా బాగుంది. దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్, చిత్రయూనిట్‌కి అభినందనలు. ఈ నెల 10న రాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి, పెద్ద విజయం అందించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మా సినిమాని అందరూ పెద్ద హిట్ చేయాలి'' అని కోరారు. ''మంచి స్క్రీన్ ప్లేతో మా చిత్రం రాబోతోంది'' అన్నారు మల్లికార్జున ఎలికా. ''నేటి ట్రెండ్‌కు తగ్గ కథ ఇది'' అని రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి చెప్పారు. ''మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమా రూపొందించారు'' అన్నారు రమణ్.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


విరాజ్, యశశ్రీ రావు

విరాజ్ అశ్విన్, ప్రియదర్శిని రామ్, బాబూ మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ ముఖ్య తారలుగా కొత్త సినిమాకి కొబ్బరి కాయ కొట్టారు. వినోద్ గాలి రచన, దర్శకత్వంలో ఈటీవీ విన్‌తో కలిసి 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రవిశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్‌కేఎన్ దర్శకత్వం వహించారు. నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ మెహర్ రమేశ్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితరులు అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రెహాన్ షేక్, సంగీతం: సుహాస్.